ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 14 | సంచిక : 07 | మార్చి 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాతాళమెరక ....... 28-11-08
గుండుగొలను ...... 24-12-08
జిన్నూరు .............. 11-01-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-08, పాతాళమెరక)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన బుద్ధిలో దోషం లేకపోతే, మనకు వేరుబుద్ధి లేకపోతే, మనందరం ఒక్కటే అని నోటితో చెప్పటంకాదు అది మనకు అనుభవానికి వస్తే అరచేతిలో ఉన్న వస్తువును ఎంత స్పష్టంగా మనం చూడగలమో అంత స్పష్టంగా హృదయంలో ఉన్న పరమాత్మ మనకు గోచరిస్తాడు. మన శరీరానికి డ్రైవర్ మన బుద్ధి అందుచేత బుద్ధిని జాగ్రత్తగా కాపాడుకొంటూరావాలి. మీరు విద్యను ఎలా సంపాదించుకొంటున్నారో, ధనాన్ని ఎలా సంపాదించుకొంటున్నారో, గౌరవాలను ఎలా సంపాదించుకొంటున్నారో అలాగ సత్వగుణాన్ని సంపాదించుకొంటూ రావాలి. ప్రతీ చిన్నవిషయానికి రియాక్టు అవుతూ ఉంటే సత్వగుణం రాదు. మొక్కకు నీరుపోసి, పురుగులు పట్టకుండా మందులు కొట్టి ఎలా కాపాడుకొంటామో అలాగ సత్వగుణాన్ని జాగ్రత్తగా పోషించుకొంటూ వస్తే హృదయంలో ఉన్న సౌందర్యం మనకు గోచరిస్తుంది. ఈశ్వరుడిని తెలుసుకోవాలని మనం అనుకొంటున్నాము. ఎందుచేతనంటే ఈశ్వరుడిలో శాంతి ఉంది, ఈశ్వరుడిలో ఆనందం ఉంది, ఈశ్వరుడిలో జ్ఞానం ఉంది, మనం ఈశ్వరానుభవం పొందితే ఇవిఅన్నీ మనకు వస్తాయి. అందుచేత మనం ఏదైనా ఒకమాట మాట్లాడినా, ఒకపని చేసినా, మనకు ఏదైనా ఆలోచన వచ్చినా ఇది ఈశ్వరసాక్షాత్కారం పొందటానికి ఎంతవరకు మనకు ఉపయోగపడుతోంది అని జాగ్రత్తగా ప్రతిక్షణం చూసుకోవాలి. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో భగవదనుభవం పొందాలి అనుకొనేవాడు అంత జాగ్రత్తగా

ఉంటూ ప్రయత్నం చేయాలి.

ఈ శరీరం చనిపోయాక మనకు శరీరం ఉండదు, ఈ శరీరం ఉండగానే శరీరం లేనిస్థితిని ఎవడు పొందుతాడో వాడు మాత్రమే బ్రాహ్మీస్థితిని పొందగలడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. శరీరం ఉండగా శరీరం లేనిస్థితిని పొందాలి అంటే ఇంద్రియాలు కంట్రోలులో ఉండాలి, మనస్సు కంట్రోలులో ఉండాలి, మన చుట్టూ ఎన్ని భోగాలు ఉన్నా వాటిమీదకు మనస్సు వెళ్ళకూడదు. మనందరిలో ఉన్న పొరపాటు ఏమిటి అంటే మనం ఎదుటివారిలో ఉన్న చెడ్డను చూస్తాము గాని వారిలో ఉన్న మంచిని చూడము. మనం చెడ్డవారము కాబట్టి మనకు వారిలో ఉన్న చెడ్డ మాత్రమే కనబడుతుంది. వారిని బాగుచేద్దాము, వీరిని బాగుచేద్దాము అనుకొంటాము. ఎవరినో బాగుచేయటం కాదు ముందు మనలను మనం బాగుచేసుకోవాలి. ఇతరులను సంస్కరించటంకాదు ముందు వారిని వారు సంస్కరించుకోవాలి. వారిని వారు సంస్కరించుకోకుండా ఇతరులను సంస్కరించటానికి ప్రయత్నం చేసినా వారు ఫెయిల్ అవుతారు. మనం ఈశ్వరుడి పాదాలయందు భక్తి కలిగి ఉండాలి. ఈ మధ్య మా పరిస్థితులు బాగాలేవు అందుచేత అశాంతిగా ఉంది అని అంటారు, అది అబద్ధం. మీ అశాంతికి, బయటపరిస్థితులకు అసలు సంబంధం లేదు. అన్నీ ఉండి క్షోభ పడేవారు ఉన్నారు, ఏమీలేక సాయంత్రం భోజనం ఉంటుందో లేదో అనేవారు కూడా ఆనందంగా ఉన్నవారు ఉన్నారు. మనకు ఈ కారణం వలన దుఃఖం వస్తోంది, ఆ కారణం వలన దుఃఖం వస్తోంది అనుకొంటాము కాని మన అజ్ఞానం వలనే మనకు దుఃఖం వస్తోంది అనే చిన్న విషయం కూడా మన బుద్ధికి అందటం లేదు.

కాలంలో మార్పులు వచ్చినట్లే లాభనష్టాలు, సుఖదుఃఖాలు, గౌరవాలు అగౌరవాలు ఇవన్నీ కాలప్రవాహంలో వస్తూ ఉంటాయి, వాటి కారణం వలన అశాంతి వస్తోంది అని నువ్వు అనుకొంటావు గాని అది నిజం కాదు. ఈ దేహమే నేను, ఈ మనస్సే నేను అని అనుకోవటం వలన, వ్యక్తిభావన వలన, అజ్ఞానం వలన నీకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది కాని బయట కారణాల వలన కాదు. అజ్ఞానం తొలగించుకోవటానికి కనీసం మనం ప్రయత్నం చేయటం లేదు. దేవాలయాలకు వెళితే లోకానికి సంబంధించినవి అడుగుతాము కాని నాకు జ్ఞానాన్ని ప్రసాదించు, వైరాగ్యాన్ని ప్రసాదించు అని అడిగేవారు ఒక్కరూ లేరు. మనం ఎంత లిటిల్ మైండెడ్‌గా ఉంటాము అంటే పూర్వం ఒకావిడ ఉదయాన్నే లేచి గదులు తుడుచుకునేది, ఆరోజు చీపురుకట్ట కనబడలేదు. ఆ టైములో

దేవుడు కనిపించి ఏమి కావాలి అని అడిగితే మోక్షం అడగాలి అనే గొడవ లేదు, ఆ టైములో చీపురుకట్ట అవసరం కాబట్టి చీపురుకట్ట కావాలి అని అడిగింది అంటే మనం అంత లిటిల్ మైండెడ్‌గా ఉంటున్నాము.

నాకు మోక్షం కావాలి, నాకు జ్ఞానం కావాలి అని కొంతమంది అడుగుతున్నారు. మీకు లోపల ప్రిపరేషన్ లేదు, ప్యూరిటీ లేదు. చిన్న గుడిసెలోనికి పెద్ద ఏనుగును తోలితే ఆ గుడిసె పరిస్థితి ఎలా ఉంటుందో ఇప్పుడు నేను మోక్షం ఇస్తే మీ పరిస్థితి కూడా అలాగే ఉంటుంది, ఉక్కిరిబిక్కిరి అయ్యి చస్తారు అనేవారు భగవాన్. భగవంతుడిని ఏదీ అడగనక్కరలేదు. మనకు ఏది ఎప్పుడు అవసరమో అది ఎలా ఇవ్వాలో కూడా ఆయన నిర్ణయించుకొంటాడు. మనం అడిగినంతమాత్రంచేత ఇచ్చేయడు. ఆయన పాదాలను ఆశ్రయించటం వలన మనం సంసారసముద్రాన్ని తేలికగా దాటగలము. పరధర్మం ఎంత గొప్పగా ఉన్నా దానిజోలికి వెళ్ళకు, స్వధర్మం ఆచరించు. స్వధర్మం అంటే నీ మనస్సుకు అనుగుణమైన పని చెయ్యి, దానికి విరుద్ధంగా చేస్తే అది పరధర్మం. పరధర్మం అశాంతిని తీసుకొని వస్తుంది, స్వధర్మం శాంతిని తీసుకొనివస్తుంది. ఒక కోరికను నెరవేర్చుకోవటం వలన సరిపోతుంది అనుకొంటే నెరవేర్చుకోవచ్చుకాని అది అక్కడితో ఆగిపోదు ఈ నెరవేరిన కోరిక అనేక కోరికలను తీసుకొనివస్తుంది. దేహానికి కంఫర్టు కంటే మనస్సు కంట్రోల్‌వలన ఎక్కువ ఆనందం వస్తుంది. మీకు మైండ్‌కంట్రోల్ లేకపోతే బయటపరిస్థితులు మీకు ఎంత అనుకూలంగా ఉన్నా వాటివలన ఏమీ ప్రయోజనం లేదు.

అమృతానుభవం పొందటానికి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ముఖ్యం. అందుచేత మనస్సును నియమించుకోవటానికి అన్ని విధములుగా ప్రయత్నం చెయ్యి. అగ్నిలో నెయ్యి పోస్తూ దానిని ఆర్పాలి అనుకోవటం ఎటువంటిదో కోరికలను నెరవేర్చుకొంటూ వాటిని జయించాలి అనుకోవటం కూడా అటువంటిదే, అది సాధ్యం కాదు. అందుచేత కోరికల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. మన హృదయంలో ఉన్న శాంతి మన సహస్రారానికి అందేవరకు ఎక్కడో ఆనందం ఉంది, ఎక్కడో శాంతి ఉంది అని మన మనస్సు బజారులో తిరుగుతూ ఉంటుంది. మనస్సు ఎక్కడనుండి అయితే ఉదయించి వచ్చిందో అక్కడ అది స్థిరంగా ఉన్నప్పుడు హృదయంలో ఉన్న ఆనందం, శాంతి దానికి అందుతుంది. పచ్చగడ్డి తినటానికి అలవాటుపడిన దూడ ప్రక్కన వట్టిగడ్డి ఉన్నా అది తినదు అలాగే ఆత్మశాంతి నీ చేతికి అందినప్పుడు ఇంక నీ మనస్సును విషయసుఖాలవైపుకు తోలినా అది వెళ్ళదు. ఆత్మజ్ఞాన

సముపార్జనకంటే మించిన పని మరొకటి లేదు అన్న సంగతి, అసలు ఆబుద్ధి మనకు రావటంలేదు, దానికి కారణం మనకు పుణ్యబలం లేదు. నీయందే నీవు సుఖాన్ని పొందుతూ ఉండాలి, నీయందే నువ్వు శాంతిని పొందుతూ ఉండాలి. బయట వస్తువులనుండిగాని, వ్యక్తులనుండిగాని నువ్వు ప్లెజర్ తీసుకొన్నా అది అంతా సారో కింద మారిపోతుంది. అవన్నీ పునర్జన్మ హేతువులు అవుతాయి. స్వరూపసుఖాన్ని పొందటం మీరు అనుకొన్నంత తేలికకాదు, నేను అనే తలంపు, నాది అనే తలంపు మనలను బంధిస్తున్నాయి, వీటినిబట్టి మిగతా తలంపులు వస్తున్నాయి. నేను అనే తలంపు మనం దాటలేకపోతున్నాము. ఈ గెడప దాటాలంటే స్వప్రయత్నం ఉండాలి, గురువు యొక్క శిక్షణ ఉండాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి, శాస్త్రం యొక్క అనుగ్రహం ఉండాలి. మనం శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకోవాలి కాని రోజుకో రకంగా ఉండే మనుషులు చెప్పే మాటలను ప్రమాణంగా తీసుకోకూడదు, శాస్త్రాన్ని అనుసరించి మన ప్రవర్తన ఉండేలాగ దైనందిన జీవితంలో మన బిహేవియర్‌ను సరిచేసుకొంటూ రావాలి, అలా మన ప్రవర్తనను సరిచేసుకొంటూ జీవిస్తూ ఉంటే మనస్సు నెమ్మదిగా అది ఎక్కడ నుండి అయితే ఉదయించి వచ్చిందో అక్కడకు పడిపోతుంది.

మాయ అంతా నామరూపాలలో ఉంది అన్నారు భగవాన్. కర్రతోటి ఏనుగును చేస్తే పిల్లకాయలు దానిని చూసి ఏనుగు, ఏనుగు అంటారు. అది ఏనుగా అంటే ఏనుగుకాదు, కర్రే. ఈ నామ రూపములు నిజం అని మనం అనుకొంటాము మన దృష్టి నామరూపాలకు పరిమితమైపోతుంది. కాని జ్ఞాని అంతర్యామిగా ఉన్న పరమాత్మను చూస్తూ ఉంటాడు. అందుచేత ఆయనకు వికారములు కలుగవు. మంచిపనులు చేయండి. అసలు మనం మంచిపనులు ఎందుకు చేయాలి. లోకంలో ఎవరో మెచ్చుకొంటారు అని మంచిపనులు చేస్తూ ఉంటే, గొప్పలు ఆశించి మంచిపనులు చేస్తూ ఉంటే మీకు గౌరవాలు రావచ్చుకాని మూలంలో చాలా నష్టపోతారు. నువ్వు ఎంతవరకు బాగుపడుతున్నావు, నీలోపల ఉన్న మాలిన్యాన్ని ఎంతవరకు తొలగించుకోగలుగుతున్నావు అనేది ముఖ్యం. నువ్వు ఏది మాట్లాడినా, ఏ పని చేసినా ఈశ్వరుని దయను పొందటానికి చేస్తూ ఉంటే ఈశ్వరుని దయను నువ్వు సంపాదిస్తే శరీరం అనంతరం కాదు, శరీరం ఉండగానే మోక్షసుఖాన్ని పొందుతావు. జాగ్రదవస్థలో మనం పనిచేసుకొంటాము, నిద్రావస్థలో మనం రెస్టు తీసుకొంటాము. మరి స్వప్నావస్థను భగవంతుడు ఎందుకు పెట్టాడు. మనలో ఉన్న బలహీనతలు ఒకోసారి జాగ్రదవస్థలో మనకు తెలియవు. నీ మనస్సు ఎలా పనిచేస్తోందో,

నీ బలహీనతలు ఏమిటో స్వప్నావస్థలో నీకు తెలుస్తూ ఉంటాయి. అప్పుడు ఆ బలహీనతల నుండి బయటకురావటానికి ప్రయత్నం చేయాలి. ఏ కారణం వలన మన మనస్సు బాహ్యముఖమవుతోందో చూసుకొని ఆ కారణాన్ని కట్ చేయాలి. ఏదైతే చెడ్డ అని ఇప్పుడు మనం అనుకొంటున్నామో, దేనిని తొలగించుకోవటానికి ఇప్పుడు మనం ప్రయత్నం చేస్తున్నామో ఒకప్పుడు అంటే పూర్వజన్మలలో ఇది మంచిది, ఇది మనకు ఉపకారం చేస్తుంది అని అనుకొని మనం అలవాటుచేసుకొన్నవే. పూర్వజన్మలలో అలవాటు చేసుకోకపోతే ఇప్పుడు మనకు ఎలా వచ్చినాయి. అప్పుడేమో తెలియక ఇవిఅన్నీ అలవాటు చేసుకొన్నాము. ఇప్పుడు విషయం తెలుస్తోంది, మోక్షం పొందటానికి ఇవే అడ్డు అని మనకు తెలుస్తోంది అందుచేత వాటిని తొలగించుకోవటానికి ఇప్పుడు మనం ప్రయత్నం చేస్తున్నాము. గురువు నిన్ను ఏమీ తిట్టడు, నిన్ను విమర్శించడు. నీలో ఉన్న బలహీనతలను నీకు చూపిస్తాడు. చూపించి నిన్ను విడిచిపెట్టేయడు, వాటిలో నుండి విడుదల పొందటానికి నీకు శక్తిని ఇస్తాడు. ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని నువ్వు పొందేవరకు నిన్ను విడిచిపెట్టడు, ఆయన గురువు.

మీరు ఏ పనిచేసినా చిత్తశుద్ధి కోసం, ఈశ్వరుని దయకోసం చేయండి. మనం పని ఎలా చేయాలి అంటే ఈ ప్రపంచంలోనికి మనం వచ్చి వెళ్ళిపోయామని జాడకూడా పక్కవాడికి తెలియకూడదు, మనం చేస్తున్న పని అంత సైలెంట్‌గా చేయాలి, వాడు పరమేశ్వరుని అనుగ్రహానికి పాత్రుడవుతాడు. ఈశ్వరుడికంటే మన క్షేమం కోరేవారు ఎవరూ ఉండరు. ఈశ్వరుడు చెప్పిన వాక్యాన్ని ప్రమాణంగా తీసుకొని మనం జీవించాలి. ఒకవేళ దానికి విరుద్ధంగా నీ మనస్సు పని చేస్తూ ఉంటే నీ మనస్సులో ఏవో దోషములు ఉన్నాయి, వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టు. శాస్త్రం మీద మనకు గౌరవం లేకపోతే శాస్త్రం తన హృదయాన్ని మనకు ఇవ్వదు. శాస్త్రం మనకు తల్లిలాంటిది. ఈపని చెయ్యి, ఇది పనికిరాదు అని మనకు ఆదేశిస్తుంది. ఆయన చెయ్యమని చెప్పింది చెయ్యటం, వద్దని చెప్పింది మానివేయటమే, దానిగురించి తర్కించటం అనవసరం. మనం సాధన చెయ్యగా చెయ్యగా మనకు అనుభవం వచ్చాక మన అనుభవానికి శాస్రానికి సరిపోతూ ఉంటుంది. అందుచేత శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకోండి, పరమేశ్వరుడియందు భక్తిని పెంచుకోండి. మన చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంత తేలికో పరమేశ్వరుని దయను సంపాదిస్తే అన్నీ సాధ్యమే, మోక్షం కూడా దానంతట అదే వచ్చి నిన్ను వరిస్తుంది. మనం పని దొంగలం అవ్వకూడదు. ఈశ్వరుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. నువ్వు చేస్తున్నపని అంతటా వ్యాపించి ఉన్న ఈశ్వరుడికి అర్చనగా

చెయ్యి. నువ్వు చేస్తున్న కర్మ ఫలితం అంతా ఈశ్వరుడికి ఆఫర్‌చేసి ఆయన దయను సంపాదించు. ఆచార్యులువారు ఏమని చెప్పారు అంటే పనే గమ్యం కాదు. స్వార్థం లేకుండా పని చేయటం వలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి ద్వారా నీకు జ్ఞానం కలుగుతుంది అని పనికి ఇవ్వవలసిన ఇంపార్టెన్సు ఇస్తూ గమ్యం ఏదో చెప్పారు.

మనం సంపూర్ణంగా రాగద్వేషములు లేకుండా ఉంటేనే ఎదుటి మనిషిని ప్రోపర్‌గా అర్థం చేసుకోగలము కాని రాగద్వేషములు ఉంటే ఎలా అర్థమవుతాడు. ఈ భూమిమీద తిరుగుతున్నప్పుడే మేగ్జిమమ్ సాధనచేసి రాగద్వేషములు తగ్గించుకో అని పరమాత్మ రిపీటెడ్‌గా చెప్పాడు. రాగద్వేషాలను తొలగించుకోకపోతే నువ్వు బ్రాహ్మీస్థితిని పొందలేవు. నీకు రోగం వచ్చినప్పడు టాబ్లెట్ ఎలా వాడుతున్నావో అలాగ ఆకలి అనే రోగానికి సరిపడ ఆహారం తీసుకో. అలా కాకుండా రుచి కోసం ఎక్కువ తినేస్తూ ఉంటే అదే అనేక రోగాలకు కారణం అవుతుంది. శరీరం నిలబడటానికి సరిపడ ఫుడ్ తీసుకొంటూ, మీరు సత్కర్మ చేస్తూ మనస్సును పవిత్రం చేసుకోవటానికి మీ జీవితాన్ని ఉపయోగించుకోవాలి. అంతకంటే మించిన పని ఈ లోకంలో ఏదీ లేదు, ఒకవేళ ఏదైనా ఉందని నువ్వు అనుకొన్నా అవి అన్నీ ఒకటిలేని సున్నలతో సమానము. మనం తినే ఆహారం యొక్క ప్రభావం బ్రెయిన్ మీద చాలా ఉంటుంది. సాత్విక ఆహారం తీసుకోవాలి, అది కూడా యుక్తంగా తీసుకోవాలి. ఈ రోజున మనం చెప్పకొన్న సబ్జక్టు యొక్క సారాంశం ఏమిటి అంటే మన మనస్సును పవిత్రం చేసుకోవటం కంటే మించిన పని ఈ లోకంలో ఏదీ లేదు అందుచేత మనం చేస్తున్నపని మనస్సు పవిత్రం అవ్వటానికి సహకరించాలి. ఈ మనస్సును వదిలేసి ఏదో పుణ్యం వస్తుందని మనం పనులు చేసినా కాలప్రవాహంలో మన శరీరాలు ఎలా పోతున్నాయో అలాగే ఈ పుణ్యాలు కూడా అనుభవిస్తే పోతాయి. అందుచేత మోక్షం పొందటానికి నీ మనస్సును ప్రిపేర్ చేయటానికి ప్రయత్నం చెయ్యి. ఎవరోవచ్చి నీ మనస్సును బాగుచేస్తారని ఎదురుచూడవద్దు. నీకు ఎవరైనా డబ్బు ఇవ్వవచ్చు, పొలం కొనిపెట్టవచ్చు కాని నీ మనస్సును ఎవరు బాగుచేసిపెడతారు, ఎవరిమటుకు వారు ప్రయత్నం చేసి మనస్సును బాగుచేసుకోవాలి. మనం అన్ని విధములుగా ప్రయత్నం చేసి మనస్సును నియమించుకొంటూ ఆరోజుకారోజు మనస్సును పవిత్రం చేసుకొంటూ మోక్షం పొందటానికి దానిని తయారుచెయ్యాలి. నీలోపల ఉన్న సత్యవస్తువు ఎంత పవిత్రంగా ఉందో నీ మనస్సు కూడా అంత పవిత్రం అయితే అది తదాకారం చెందుతుంది.

మీకు వందకోరికలు ఉన్నాయి అనుకోండి. 99 కోరికలు నెరవేరి ఇంకా ఒక్క

కోరిక మిగిలింది అనుకోండి మనం పతనమవ్వటానికి ఆ ఒక్క కోరిక చాలు. అందుచేత ఒక్క కోరికే ఉందని నెగ్లెట్ చేయవద్దు. చిన్న నిప్పుకణం ఉన్నా దానిని బట్టి ఇల్లు అంటుకోవచ్చు. అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. మార్పు అనేది పైనుండి వచ్చేది కాదు, లోపల నుండి రావాలి, మూలంలో నుండి మార్పు తెచ్చుకోవాలి. మారుమనస్సు పొందాలి అంటే ఈ శరీరం ఉండగానే చనిపోయి మరల పుట్టాలి అప్పుడు మనం మారుమనస్సు పొందుతాము. మన స్వభావాన్ని ఒక్క రోజులో మార్చుకోలేము, నెమ్మదిగా మార్చుకొంటూ రావాలి. పూర్వజన్మ సంస్కారాలు అనేకం ఉంటాయి. సడన్ బ్రేక్ వేసినా ప్రమాదమే. గమ్యాన్ని మర్చిపోకుండా మన స్వభావాన్ని మార్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే సక్సెస్ అవుతాము. మీరు అందరు ఈశ్వరానుగ్రహం సంపాదించుకోవాలి. ఈశ్వరానుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే. ఈశ్వరానుగ్రహం మీకు లేదు అనుకోండి మీకు ఎన్నివేల కోట్లు ఉన్నా అది అంతా సున్నా, ఏమీ లేనట్లే. ఎందుచేతనంటే మీ హృదయాన్ని జ్ఞానంతో, ఆనందంతో, శాంతితో నింపేది ఈశ్వరుని దయ. ఈ ఒక్క వాక్యాన్ని గుర్తుపెట్టుకొని దానిని మీరు మననం చేయండి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-12-08, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు ఏమతంలో ఉన్నా, ఏకులంలో ఉన్నా అజ్ఞానం నశించకుండా మీ హృదయంలో ఉన్న ఆనందం మీచేతికి అందదు. మీకు ఆనందానుభవం వచ్చేవరకూ పునర్జన్మ తప్పదు, ఏ జన్మకు ఆజన్మ శవాలను మోస్తూఉండవలసిందే. మనకు ఉన్న అహంకారానికి ఈ శవం నిజం అనిపిస్తుంది, ఈ ఎల్లమ్మ, సుబ్బమ్మ వీళ్ళందరూ నిజం అనిపిస్తారు. లోపలఉన్న ఈశ్వరుడు అబద్ధం అని మన అహంకారం చెబుతుంది. మీకు ఇష్టంలేనివారు ఏదైనా తప్పచేస్తే దానిని పెద్దది చేసేస్తారు. అదే మీకు ఇష్టమైన వారు తప్పచేసారు అనుకోండి అందులో పెద్ద విశేషం ఏమీలేదండి అని చెపుతారు. ఇది అహంకారం చేసే మోసం. వ్యక్తిభావన ఈ గారడీ అంతా చేస్తోంది. ఈ అడవిలోనుండి బయటకు రాకపోతే మనకు జ్ఞానం కలుగదు. మనం తెగిపోయిన గాలిపటంలాగ ఉండకూడదు, మన నిదానంలో మనం ఉండాలి. హృదయంలో ఉన్న ఆనందం మనకు అనుభవంలోనికి వచ్చాక అది ఉబికి ఉబికి మన సహస్రారాన్ని ముంచేస్తుంది. హృదయానికి, సహస్రారానికి మధ్యన చిన్ననాడి ఉంటుంది. జ్ఞానం వచ్చినప్పడు ఆ నాడి ఓపెన్ అయ్యి హృదయంలో ఉన్న ఆనందం సహస్రారాన్ని ముంచేస్తుంది. అది ఓపెన్ అవ్వటం అంత తేలికకాదు. స్వప్రయత్నం, కాలపరిపక్వం ఇవన్నీ ఉన్నా ఈశ్వరానుగ్రహం లేకుండా అది

ఓపెన్ అవ్వదు. ఆ ముహూర్తం ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. ఒకవేళ మేము బుద్ధిమంతులం, మేము బుద్ధిమంతులం అని మీమీద మీరు అక్షింతలు వేసుకొన్నా అది ఓపెన్ అవ్వదు. అది ఓపెన్ అయ్యేవరకూ మీకు పునర్జన్మలు తప్పవు. అది ఓపెన్ అయ్యి ఆనందం మీ సహస్రారాన్ని ముంచినప్పడు ఈ పంచభూతాలు, జీవకోటి, ఈ చావులు పుట్టుకలు, బయటఉన్న ప్రపంచం అంతా ఆ ఆనందంలో కలిసిపోతుంది. అప్పడు నాకంటే వేరుగా ప్రపంచం ఉంది, నాకంటే వేరుగా దేవుడు ఉన్నాడు, నాకంటే వేరుగా ఎల్లమ్మ ఉంది అనే భావన ఉదయించదు. అంటే వేరుబుద్ధి పోతుంది. వేరుబుద్ధి ఎప్పడైతే పోయిందో అప్పడు భయంకూడా పోతుంది. అప్పటివరకు భయం ఏ మనిషినీ విడిచిపెట్టదు.

మీ ఇంట్లో ఎవరికైనా జ్వరం వచ్చింది అనుకోండి, మీకే వచ్చేసినట్లు అనుకొంటారు. మీకు వారికి సంబంధం ఏమిటి? ఏదో ప్రారబ్ధాన్ని బట్టి ఒకే ఇంట్లో సిద్ధమయ్యారు. జ్వరం వస్తే హాస్పటల్‌కు తీసుకొని వెళ్ళాలి, మీ డ్యూటీ చెయ్యాలి కాని జ్వరం నాకే వచ్చేసింది అనుకొంటే నువ్వు ఇంక పనికిరావు. మీ ఇంట్లోవారు చనిపోయినప్పడు నువ్వు చనిపోతావా? లేకపోతే నువ్వు చనిపోయినప్పడు వారు చనిపోతారా? లేదు. ఒకటే ఒకటే అనుకొనే వాళ్ళు చనిపోవాలి కదా, అలా అనుకోవటం కూడా మాయ. ప్రారబ్ధాన్ని బట్టి ఒకే ఇంట్లో సిద్ధమయ్యాము కాబట్టి మన డ్యూటీ మనం చేయాలి. అలా మన డ్యూటీ మనం చేయకుండా వారికి రోగం వస్తే మనకే వచ్చినట్లు, వారికి పది రూపాయలు కలిసివస్తే మనకు కలిసివచ్చినట్లు, వారికి ఏదైనా నష్టం వస్తే మనకే వచ్చినట్లు ఇలా కలగాపులగం చేసుకొని అజ్ఞానంలో కూరుకొనిపోతున్నాము. వివేకం, వైరాగ్యం లేకుండా అజ్ఞానం నశించదు అని ఆచార్యులవారు చెప్పారు. నువ్వు ప్రపంచాన్ని అలా చూస్తూ ఉండు. వివేకం వచ్చాక ప్రపంచం ఒకరకంగా కనిపిస్తుంది, వివేకం లేనప్పడు మరొక రకంగా కనిపిస్తుంది. అలాగే వైరాగ్యం లేనప్పడు ఒకరకంగా ఉంటుంది, వైరాగ్యం ఉన్నప్పడు ఒకరకంగా ఉంటుంది. మనకు వైరాగ్యం లేదు అనుకోండి ప్రతీ వస్తువు మనలను ఆకర్షిస్తుంది, వైరాగ్యం ఉంటే లోకంలో ఏదీ నిన్ను ఆకర్షించలేదు. మేము ఆ దేవుడిని పూజిస్తున్నాము, ఈ దేవుడిని పూజిస్తున్నాము అది కాదు, మీకు ఇష్టమైన దేవుడిని పూజించుకోండి, లోపల వివేకం, వైరాగ్యం పెంచుకొంటూ రావాలి. వివేకం, వైరాగ్యం అభివృద్ధి చేసుకోకుండా బయట ఏవో సాధనలు చేస్తున్నాము అంటే దాని వలన మీకు అజ్ఞానం నశించదు. కడుపులో పుండు ఉంది, పైన కొబ్బరినూనె వ్రాస్తాము అంటే ఆ పుండు ఎలా తగ్గుతుంది. అజ్ఞానం మన లోపల ఉంది, అది పోయే

విధానం జాగ్రత్తగా చూసుకోండి అంటున్నారు ఆచార్యులవారు.

ఓం సాక్షిణేనమః ఇది విష్ణుసహస్రనామాలలో ఒక నామం, ఇది రోజూ అనుకోండి. నువ్వు చేసే ప్రతి పనిని, నీకు వచ్చే ప్రతీ తలంపును నువ్వు నిద్రావస్థలో చేసినా, జాగ్రదవస్థలో చేసినా, స్వప్నావస్థలో చేసినా లోపల సాక్షిగా ఉండి ఆయన నిద్రపోకుండా ప్రతీక్షణం మిమ్మల్ని చూస్తున్నాడు, వాడే సర్వసాక్షి, వాడే ఈశ్వరుడు, ఆ టైము వచ్చినప్పుడు వడ్డిస్తాడు. ఏదో కర్మ చేసాము తప్పకుపోయాము అని మీరు అనుకొంటారు అనుకోండి. ఈ జన్మలో ఆ గొడవ రాదు అనుకోండి, వచ్చే జన్మలో అయినా అది మీరు అనుభవించవలసిందే. పది ఆవులు ఉన్నాయి అనుకోండి, మీరు దూడను విడిచిపెడితే అది పది ఆవుల దగ్గరకు వెళ్ళదు, దాని తల్లి దగ్గరకు వెళ్ళి పాలుతాగుతుంది. అదేవిధంగా నువ్వు చనిపోయి ఏ లోకంలోనికి వెళ్ళినా నువ్వు చేసిన కర్మ నీ దగ్గరకు వచ్చి నామాట ఏమిటి చెప్పు అంటుంది, అది నీకు అనుభవం లోనికి వచ్చేవరకు కర్మ నిన్ను విడిచిపెట్టదు. మీ ఇంట్లో పదిమంది మనుషులు ఉన్నారు అనుకోండి, ఎవరికర్మ వారిదే. అందుకే జతలు వేసుకోవద్దు, మీ డ్యూటీ మీరు చేయండి. మనమే వాళ్ళు, వాళ్ళే మనము అని పిచ్చిలో పడకుండా ఎవరి డ్యూటీ వారు చేస్తూ, కొంచెం లోకానికి కూడా ఏదో మంచి చేస్తూ ఉండాలి. దానివలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి లేనివాడు ముక్తిని సాధించలేడు.

ఇప్పుడు మనకు అన్నీ కావాలి, ఆత్మకావాలి. లోకంలో అన్ని గొడవలు మనకు కావాలి, మధ్యలో దేవుడు కూడా కావాలి. ఆత్మజ్ఞానం ఎవరికి వస్తుంది అంటే ఆత్మకాముడు మాత్రమే ఆత్మసామ్రాజ్యానికి అధిపతి అవుతాడు. ఆత్మకాముడు అంటే ఆత్మ తప్పించి ఇంకో రకమైన కామం ఏమీ లేనివాడు. మనకు 90 కామాలు ఉన్నాయి. ఆత్మను మాత్రమే కోరుకొనేవాడు, ఆత్మపట్ల మాత్రమే ప్రీతికలవాడు ఆత్మజ్ఞానం పొందుతాడు కాని మీకు రాదు అని చెప్పటం. ఎగిరిఎగిరిపడేవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఎగిరిఎగిరిపడితే నువ్వు ప్రకృతిలో పడతావు. ఆత్మజ్ఞానంలో నువ్వు అణగాలి. మంచికర్మ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా దానికోసమే, ఆ గమ్యం మరిచిపోవద్దు. నువ్వు ఏదిగా ఉన్నావో అందులో నీ మనస్సు అణగాలి, అప్పుడు అది నీకు అనుభవంలోనికి వస్తుంది. తినటంకోసం బతికేవాడికి జ్ఞానం రాదు, బతకటం కోసం తినేవాడికి జ్ఞానం రావచ్చు అని శాస్త్రం చెప్పింది. మనం తినటంకోసమే బతుకుతున్నాము అని మనకు తెలుస్తోంది కదా ఇంక మనకు జ్ఞానం ఏమిటి? మీరు ఏదైనా మంచి పనులు చేసినా గౌరవం ఆశించకూడదు. లౌకికమైన ప్రయోజనం ఆశించకుండా చేసే కర్మ వలన

మీ మనస్సు పరమాత్మలో అణుగుతుంది, లౌకికమైన ప్రయోజనం ఆశిస్తే మనస్సు బయటకు వచ్చేస్తుంది, దాని వలన ప్రయోజనం సున్నా, చివరకు చెమట మిగులుతుంది. దేవుడి మీద నాకు ఇష్టం ఉంది, ప్రీతి ఉంది, ఆయన వేరుగా ఉండాలి, నేను వేరుగా ఉండాలి అనుకొంటున్నాను నా కోరికను మీరు బలపర్చండి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నది సముద్రం దగ్గరకు వెళుతుంది అనుకోండి, నది నేను వేరుగా ఉండాలి, వేరుగా ఉండాలి అని అనుకొన్నా కుదురుతుందా? సముద్రం తనలో ఐక్యం చేసేసుకొంటుంది. అలాగే నీ భక్తి నిజమైతే, నీ తపన నిజమైతే నిన్ను ఆయనలో ఐక్యం చేసేసుకొంటాడు. నువ్వు వేరుగా ఉండాలన్నా అక్కడ సాధ్యం కాదు అంటున్నారు.

మనందరిలో పొరపాటు ఏమిటి అంటే మనకు ఎంతోకొంత భక్తి ఉంది కాని మోక్షం తప్పించి మాకు ఏమీ అక్కరలేదు అనే జిజ్ఞాస మనకు లేదు. నీకు తెలిసినా తెలియకపోయినా నీ లోపల ఏదో ఉంది, అక్కడ ఏదో ఉంది కాబట్టే నేను, నేను అంటున్నావు. నీ లోపల ఏదీ లేకపోతే, నీలోపల ఈశ్వరుడు లేకపోతే అసలు నేను అనే తలంపు కూడా నీకు రాదు. నేను అనే తలంపు నీలోపల ఎక్కడ నుండి వస్తోందో అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు, ఆయనే సర్వసాక్షి అంతా చూస్తున్నాడు, ఎవరూ చూడకుండా మేము చేసేస్తున్నాము అనుకోవద్దు, వాటిని కూడా ఆయన లోపల నుండి చూస్తున్నాడు. వాడు నిన్ను ఏమీ అనడు. వాడు చూస్తూ ఉంటాడు, రికార్డు చేస్తాడు. ఇది మనం గుర్తుపెట్టుకొంటే కొన్ని చెడ్డ పనులు చేయటం మానేస్తాము. సత్పురుషుల సహవాసం, తపస్సు రెండూ మంచివే, ఇందులో ఏది గొప్పది అని వశిష్ఠుడికి, విశ్వామిత్రుడికి పేచీ వచ్చింది. తపస్సు గొప్పది అని విశ్వామిత్రుడు చెప్పాడు, తపస్సుకంటే సత్పురుషుల సహవాసం గొప్పది అని వశిష్ఠుడు నిరూపించాడు. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే నువ్వు మోక్షానుభవం కలిగే కుటుంబంలో జన్మించటం, నీకు ఆత్మజ్ఞానం పొందాలి అనేటువంటి తపన రావటం, నీ కాంక్ష నెరవేర్చే సజ్జనసాంగత్యం దొరకటం ఇటువంటివి అన్నీ నీకు ఊరికే లభించవు, అనేక వందల జన్మల పుణ్యబలం వలన కాని ఇవి లభించవు అని చెప్పారు. రామకృష్ణపరమహంసతో సహవాసం దొరకకపోతే వివేకానందుడు ఎక్కడ ఉన్నాడు. ఏదో చదువుకొని పెళ్లిచేసుకొని జీవించి చనిపోయేవాడు. ఒక మహాత్ముడి చూపు వలన నీ లోపలఉన్న అజ్ఞానానికి నిప్పు అంటుకొంటుంది. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా కాలటానికి ఒక్క అగ్గిపుల్లచాలు. అలాగే మీలో ఎంత అజ్ఞానం ఉన్నా అది కాలి బూడిద అవ్వటానికి ఒక్క మహాత్ముడి యొక్క అనుగ్రహం తాలుక చూపు చాలు. మహాత్ముడియొక్క దయ అనే

ఇంజన్‌తో నీకు కనెక్షన్ కుదిరితే చాలు నీ పని పూర్తి అయిపోయినట్లే. ఎంత బరువు ఉన్నా, ఎన్ని పెట్టెలు అయినా ఆ ఇంజన్ లాగేస్తుంది. అలాగే నీలో ఎంత అజ్ఞానం ఉన్నా సత్పురుషుల సహవాసం వలన అది అంతా కాలిబూడిద అయిపోతుంది. ఇంక నీకు ఏమీ మిగలదువయ్యా. ఒకవేళ దేవుడి కంటే నేను వేరుగా ఉండాలి అని నీవు అనుకొన్నా ఆయన నిన్ను ఐక్యం చేసేసుకొంటాడు, ఆవడికి నువ్వు తట్టుకోలేవు.

మీకు ఇష్టమైన గురురూపాన్నిగాని, అవతారపురుషుడి రూపాన్నిగాని తీసుకొని ఆ రూపాన్ని ధ్యానం చేయండి, ఆ నామాన్ని స్మరించుకోండి. అప్పుడు మీ మనస్సు ఆ రూపం చుట్టూ, నామం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అప్పుడు మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది. మనం లోకానికి దగ్గరగా ఉన్నాము, పరమాత్మకు దూరంగా ఉన్నాము. అందుచేత మనకు లోకం అంటే ఇష్టం, పరమాత్మ మీద మనకు అసలు రుచి లేదు, వాడిని పొందాలి అనే తపన మనకు రావటం లేదు. ఒకో కారణం వలన మనస్సు బయటకు పోతూ ఉంటుంది, ఏ కారణం వలన మనస్సు బయటకు పోతోందో చూసుకొని ఆ కారణాన్ని కట్‌చేయాలి. మీకు రోజూ సినిమాలకు వెళ్ళే అలవాటు ఉంది అనుకోండి, సినిమాలకు వెళ్ళనివారితో స్నేహాలు చేస్తే ఆ అలవాటు తగ్గిపోతుంది. పిల్లలు ఎక్కువగా టివిలలో సినిమాలు చూస్తూ ఉంటే వారి చదువు చెడిపోతుంది, శుభ్రంగా పాడైపోతారు, దానిని స్లోపాయిజనింగ్ అంటారు. మనం చూసే విషయాలలో, వినే విషయాలలో, మన ప్రవర్తనలో బహుజాగ్రత్తగా ఉంటేనేగాని మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం రాదు. మీరు ఏదో గంట జపం చేసి, గంట ధ్యానం చేసి తరువాత మనస్సును బయటకు వదిలేస్తే ఇంక సాధన ఏమిటి? నిరంతరం మనస్సు మీద నిఘా ఉండాలి. దానికి బయటకు పోవటం ఎలాగ అలవాటు అయ్యిందో వెనక్కి తీసుకొనిరావటం నువ్వు అలవాటు చేసుకో. ఎన్నిసార్లు బయటకు పోతూ ఉంటే అన్నిసార్లు నువ్వు మరల వెనక్కి తీసుకొనిరా. దాని పని అది మాననప్పుడు నీ పని నువ్వు మానకు. ఇలా కొంతకాలానికి దానికి బయటతిరుగుడు ఆగిపోతుంది. మన మనస్సుకు హృదయంలో ఉన్న శాంతి, సుఖం తెలిసాక ఇంక మనం తోలినా అది బయటకు వెళ్ళదు, అదీ భగవాన్ చెప్పేది. ఒకవేళ నీకు బ్రాహ్మీస్థితి కలిగినా ఆ మరుసటి క్షణంలోనే దేహానికి చావురాదు, నీ దేహ ప్రారబ్దంలో ఇంకా ఏదైనా పని చేయవలసి ఉంటే ఆ పని పూర్తి అయ్యేదాక ఆ దేహం ఉంటుంది. కాని ఆ దేహం ఉంటే ఏల, పోతే ఏల అందులో ఏమీ లేదు అని నీకు తెలుస్తూ ఉంటుంది.

వేదం ఒకమాట చెప్పింది, ఈ మాట అందరూ జ్ఞాపకం ఉంచుకోండి. మీకు కోట్లాది రూపాయలు ఉన్నాయి అనుకోండి, మీకు అధికారం ఉంది అనుకోండి, ఇంటి చుట్టూ పది చిన్నకార్లు, నౌకరులు ఉన్నారు అనుకోండి, మీకు అన్ని భోగాలు ఉన్నాయి అనుకోండి, ఇవన్నీ కలిసి నిద్రలో పొందే సుఖాన్ని నీకు ఇస్తున్నాయా అని వేదం అడిగింది. ఇన్ని భోగాలు ఉన్నవాడు కూడా ఒక్క రాత్రి నిద్ర పట్టకపోతే, నాకు నిద్రపట్టలేదు, నిద్రపట్టలేదు అని డాక్టరు దగ్గరకు పరుగెడుతున్నాడు. నీకు ఉన్న సర్వసంపదలు కలిసి నిద్రలో ఉన్న సుఖాన్ని నీకు ఇవ్వలేకపోతున్నాయి కాబట్టే నాకు రాత్రి నిద్రలేదు, నిద్రలేదు అని గోలపెడుతున్నావు. ఆ సుఖం అట్టిది. నిద్రలో ఉన్న సుఖమే ఇంత అద్భుతంగా ఉంటే ఇంక ఆత్మసుఖం ఎంత వైభవంగా ఉంటుంది. అది వర్ణనాతీతం. ఆత్మసుఖంలో నీకు ఈ లోకానికి సంబంధించిన తలంపులు గాని, శరీరానికి సంబంధించిన తలంపులు గాని అక్కడ రావు, అట్టిది ఆత్మసుఖం. దానిని మాటలతో చెప్పలేము కాబట్టే దక్షిణామూర్తి కూడా మౌనంగా ఉండిపోయారు. ఒకోసారి పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటాయి, ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి. ప్రతికూలంగా ఉన్నప్పుడు మీ మనస్సు ఎలా ఉంది, అనుకూలంగా ఉన్నప్పుడు ఎలా ఉంది అని లోపల ఉన్న పరమాత్మ చూస్తూ ఉంటాడు. అప్పుడు ఒకలాగ ఉండి, ఇప్పుడు ఒకలాగ ఉంటే ఇంక మనకు మోక్షం ఇవ్వడు, మట్టిలో కలిపేస్తాడు.

సాధ్యమైనంతవరకు అవసరంలేని గొడవలలోనికి వెళ్ళకూడదు. అవసరంలేని గొడవలలోనికి వెళితే అశాంతి వచ్చేస్తుంది. క్రమశిక్షణ నేర్చుకోవాలి. ఎవరో తింగరతనంగా మాట్లాడుతున్నారు అని మనం కూడా మాట్లాడకూడదు. అలా మాట్లాడితే వారు ఎలాగ చెడిపోయి ఉన్నారు మనంకూడా చెడిపోతాము. మీరు జపం చెయ్యటం, ధ్యానం చెయ్యటమేకాదు, మనం చూసే విషయాలలో, వినే విషయాలలో, చేసే స్నేహాల విషయంలో, పెరిగే వాతావరణంలో అన్నింటిలోను జాగ్రత్తలు తీసుకొంటేనేగాని మనస్సు అణగదు. ధనం సంపాదించేవాడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటేనేగాని వాడు ధనం సంపాదించలేడు, అంతకంటే ఎక్కువ కష్టపడితేగాని మనస్సు అణగదు. అందువలన ఎవరో చేసారని మనం చేయకూడదు, అనుకరణ పనికిరాదు. మనం సమాజాన్ని అనుకరిస్తే సమాజంలో కలిసిపోతాము కాని దైవాన్ని పొందలేము. లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన ఈ మూడు వాసనలు పోతేనేగాని మనస్సు వెళ్ళి హృదయంలో పడదు. మనస్సు తనని తాను చంపుకోవటానికి అది ఇష్టపడదు. అందుచేత లోకంలో ఏవో గొడవలు కల్పించుకొంటూ ఉంటుంది. భగవాన్ ఏమన్నారు అంటే నీకు నేను

అనే తలంపు వచ్చినప్పడు జీవుడు, దేవుడు, లోకం. ఆ తలంపు లేకపోతే ఈ మూడూ లేవు. గాఢనిద్రలో నేను అనే తలంపు లేనప్పడు అక్కడ జీవుడు లేడు, దేవుడు లేడు, లోకం లేదు. ఈ నేను అనే తలంపు ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు. ఈ నేను ఎవరు? అని దానిని తెలుసుకోవటం మానేసి ఎక్కడికో పరుగెడుతున్నారు. ఇదే మహా మాయ. ఈ నేను అనే తలంపును సంతృప్తిపరచుకోవటం కోసం జీవిస్తున్నాము. ఈ నేను అనే తలంపుకు ఏదో పూజ జరుగుతూ ఉండాలి. భార్య నేనును భర్త నేను సంతృప్తిపరుస్తూ ఉండాలి, భర్త నేనుకు భార్య నేను ఏదో మేత పెడుతూ ఉండాలి. ఇద్దరు ఒకరిని ఒకరు పొగడుకుంటేనేగాని సంసారం నడవదు. నువ్వు పాలు బాగాకాస్తావని మీ ఆయన అంటూ ఉండాలి, మీరు బాగా సంపాదిస్తున్నారు అని మీ భార్య అంటూ ఉండాలి, అప్పుడు బాగా కాలక్షేపం అయిపోతుంది. ఈ లోపుగా చావు వస్తుంది విడిపోయి ఎవరి దారిని వారు పోతారు. ఈలోపుగా సంసారం నడవటంకోసం ఒకరిని ఒకరు పొగుడుకోవటం, ఇది మహా మాయ అన్నారు ఆచార్యులవారు. ఈ ప్రేమలు అబద్ధం అన్నారు.

మీరు తిరుపతి వెంకటేశ్వరస్వామి దగ్గరకు వెళతారు. అక్కడ మీరు వెంకటేశ్వరస్వామిని ధ్యానం చెయ్యరు, మీ కోరికలను ధ్యానం చేస్తారు. ఆయనను దర్శించినప్పడు మీ కోరికలు మీకు జ్ఞాపకం వస్తాయి, ఆ కోరికలను నెరవేర్చమని అంటారు. మీకు కోరికల మీద ప్రేమ ఉందో, ఆయన మీద ప్రేమ ఉందో వెంకటేశ్వరస్వామికి తెలియదా? ఆయన మీ కోరికలను నెరవేర్చవచ్చుకాని మీకు జ్ఞానం సున్నా, శాంతి సున్నా, మిగిలేది దుమ్ము, ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే ఇలా రోజూ మనలను మనం మోసుకోవటం, ఇదే సాధన అనుకోవటం. మనలను మనం మోసం చేసుకొంటున్నాము అన్న సంగతి కూడా మనకు వివేకం లేకపోతే అది తెలియదు, ఇదీ గమ్మత్తు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీకు వివేకం లేనప్పుడు ప్రపంచాన్ని చూడు, వివేకం కలిగాక ప్రపంచాన్ని చూడు. అప్పుడు ఎంత తేడా ఉందో అది నీకు తెలుస్తుంది అని చెప్పారు. నీకు జ్ఞానమార్గం, వివేకం, విచక్షణ తెలియకపోయినా నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం అని భగవంతుడికి శరణాగతి చెందు. నేను లేను నువ్వే ఉన్నావు, నువ్వు ఏది పంపితే నాకు అదే ప్రసాదం అని మీరు అనుకొంటే, ఈశ్వర సంకల్పానికి మీరు స్వాధీనమైతే మీకు పెద్ద పెద్ద దుంగలలాంటి కష్టాలు వచ్చినా ఆయన అనుగ్రహ ప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. అసలు మనం లేము కాని మనం ఉన్నాము అని అనుకోవటం వలన ఈ అల్లరి అంతా. మన వలన ఏమీ అవ్వదు. ఒకవేళ మీరు ధనవంతులు అయినా

అదీ ఈశ్వర సంకల్పమే. అది మీకు తెలియక నావల్లే అయ్యింది అనుకొంటున్నారు. మనకు ఉపయోగంలేని తలంపులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఓం సాక్షిణే నమః అనుకోండి. ఈ మంత్రం వలన మీకు పైసాలు రాకపోయినా, గొప్పలు రాకపోయినా, దీనివలన మీకు చెడుతలంపులు రావటం ఆగుతాయి, మీకు చిత్తశుద్ధి కలుగుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-01-09, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున రమణజయంతి. 1912వ సంవత్సరంలో భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా జన్మదినోత్సవం చేయటం ప్రారంభించారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ శరీరం వచ్చినప్పడు మనం రాలేదు, ఈ శరీరం పోయినప్పడు మనం పోము అందుచేత ఈ జన్మదినోత్సవాలు వద్దు అని చెప్పారు. కనీసం ఈ శరీరం పుట్టినరోజున అయినా ఈ శరీరం ఎందుకు వచ్చింది అని విచారణ చెయ్యటం మానేసి ఈ దేహానికి పాయసం పెట్టి, బూర్లు పెట్టి ఈ ఉత్సవాలు అనవసరం అని భగవాన్ చెప్పారు. మనందరం నేను నేను అంటాము ఈ నేను అనే తలంపు మనకి ఎప్పడు వచ్చిందో అప్పడు మనం పుట్టాము. ఈ నేను అనే తలంపు పోయినప్పడు మనం పోతాము. మీకు మనోనాశనం అయ్యేవరకూ పునర్జన్మలు వచ్చి తీరుతాయి. మాకు ఆత్మజ్ఞానం ఎప్పడు వస్తుంది అని భగవాన్‌ని అడిగితే నువ్వు చేసిన కర్మ ఖర్చు అయ్యాక వస్తుందిలే అనేవారు. భగవాన్ తిరుచ్చుళిలో జన్మించారు. అది శివక్షేత్రం. ఆయనకు ఆత్మజ్ఞానం కలిగిన క్షేత్రం మధురై. అది శక్తి క్షేత్రం, అది శివ క్షేత్రం. మళ్ళీ అరుణాచలం వచ్చారు అది శివ క్షేత్రం. ఆయనకి శివకేశవ భేదం లేకపోయినా అంతా శివపరంగా ఆయన జీవితం నడిచిపోయింది. శివకేశవభేదం ఉన్నవాడు అద్వైతికాలేడు. ఉన్నది ఒక్కటే. ఆయన 10వ తరగతి చదివేటప్పడు ఆయనకి మరణానుభవం కలిగింది. భగవాన్ అంతకుముందు ఏ సాధనలు చేయలేదు. గ్రంధపఠనం లేదు. ఏమీ లేకుండా మరణానుభవం ఎలా కలిగింది అంటే అది దేవరహస్యం. మరణానుభవం కలిగిన తరువాత అరుణాచలేశ్వరుడు భగవాన్‌ని తీసుకువచ్చి ఆయన ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. అరుణాచలేశ్వరుడి పట్ల ఆయనకి జనకభావన ఉండేది. అందుకే తండ్రీ నువ్వు రమ్మంటేనే వచ్చాను అని చెప్పారు. భగవాన్ అరుణాచలం వచ్చిన తరువాత 54 సంవత్సరాలు ఆయన శరీరం ఆ స్థలంలోనే తిరుగాడింది. అరుణాచలం కేంద్రంగా ఆయన టీచింగు జరిగింది.

భగవాన్ బోధ ఏమిటి అంటే ఏదైతే మనకి నేనుగా వ్యక్తమవుతోందో ఆ నేనుని

తగ్గించుకోమని, ఆ నేను నష్టపోవాలని చెప్పేవారు. పరమేశ్వరుడు ఎక్కడో నీకు బయట లేడు, నీ హృదయంలోనే ఉన్నాడు. ఈ నేను అనే తలంపు నీకు అక్కడ నుండే వస్తోంది. అంటే హృదయంలో నుండే వస్తోంది, బ్రహ్మములో నుండే వస్తోంది. దానిని విచారణ చేయండి అని చెప్పేవారు భగవాన్. 1950వ సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీన ఆయన శరీరం విడిచిపెట్టారు. తట్టండి తెరువబడుతుంది, అడగండి ఇవ్వబడుతుంది అని ఏసుక్రీస్తు అన్నాడు. మనం ఎవరూ బ్రహ్మజ్ఞానం అడగటంలేదు. లోకానికి సంబంధించిన విషయాలు అడుగుతాము. అసలు దేనిని పొందాలి అని మనకు గమ్యమే లేదు. మనలో కొంతమందికి గమ్యం ఉన్నా ఆ గమ్యాన్ని రోజూ మరిచిపోతారు. దీనికి మాయ కారణం. అందుచేత మీరు ఎన్ని తిప్పలు పడినా నా అనుగ్రహం లేకుండా, నా దయలేకుండా మాయ దారి ఇవ్వదు. మీరు సంసారాన్ని దాటి ఒడ్డుకి రాలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. అంటే మనం మాయ చేతిలో వుంటాము. పరమాత్మ చేతిలో మాయ ఉంటుంది. ఇది జీవుడికి ఈశ్వరుడికి ఉన్న తేడా. ఉన్నది ఒక్కటే వస్తువు. ఈ జీవకోటి, లోకం, దేవుడు ఇవన్నీ ఒకే వస్తువు యొక్క ప్రతిబింబాలు. అద్దం మురికిగా ఉంటే మన ముఖం సరిగా కనబడదు. అద్దాన్ని శుభ్రం చేస్తే అప్పుడు అద్దంలో మన ముఖం ఎలాగ ఉంటే అలా కనిపిస్తుంది. అలాగే మీ మనస్సు అనే అద్దం పరిశుద్ధమైతే మీకు చిత్తశుద్ధి కలిగితే అప్పుడు నీకు లోపల ఉన్న వస్తువు గోచరం అవుతుంది.

బ్రహ్మజ్ఞానం లేనివాడికి బ్రహ్మాత్మబుద్ధి రాదని ముండకోపనిషత్తు చెప్పింది. ముండనం అంటే గొరిగించుకోవటం. మీ మనస్సులో ఉన్న వాసనలన్నిటినీ మీ మనస్సులోంచి పుట్టిన కోరికలన్నిటినీ శుభ్రంగా ఎవడైతే గొరిగించుకున్నాడో వాడికి బ్రహ్మజ్ఞానం కలుగుతుంది అని చెప్పింది. భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే మీరు రోజూ ఎలా స్నానం చేస్తున్నారో, మీరు రోజూ అన్నం ఎలా తింటున్నారో అలా రోజూ ఒక చిన్న మంచి పని చెయ్యండి. అలాగ చెయ్యగా చెయ్యగా నెమ్మదిగా నీకు స్వార్థం తగ్గుతుంది, తరువాత నెమ్మదిగా నీకు తెలియకుండా మనస్సు నశిస్తుంది. భగవంతుడికి పెద్దపని, చిన్నపని అని లేదు. మనం ఏ హృదయంతోటి చేస్తున్నామో, ఏ మనస్సుతోటి చేస్తున్నామో అది కావాలి భగవంతుడికి. పెద్దవాళ్ళకి పెద్దపనులు వదిలేసి మనకి తగ్గ చిన్న చిన్న పనులే చేసుకుందాం. ఆ పని కూడా నిశ్శబ్దంగా చెయ్యాలి, నిర్మలంగా చెయ్యాలి, నిరాడంబరంగా చెయ్యాలి. నిరహంకారంగా చెయ్యాలి. అలా పని పనికోసమే చేస్తూ ఉంటే కొంతకాలానికి నీకు మనో నాశనం వస్తుంది, మనోనాశనం అయితే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానంలోంచి

ఆనందం, శాంతి కలుగుతుంది. భగవంతుడు నా మాయని ఎవడూ జయించలేడు అని చెప్పాడు. అందుచేత మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. నీకు దేహము తెలుస్తోంది, మనస్సు తెలుస్తోంది. నిజమైన నేను నీ హృదయంలో ఉంది. నీ దేహానికి చావు ఉంది, నీ దేహానికి పుట్టుక ఉంది, కాని దానికి చావుపుట్టుకలు లేవు. నీకు తెలుసున్నా, నీకు తెలియకపోయినా అది నీ హృదయంలోనే ఉంది. నీకు తెలిస్తే సుఖము, శాంతి. నీకు జన్మ రాహిత్యము. నీకు తెలియకపోతే దుఃఖము, అశాంతి, నువ్వు జననమరణ ప్రవాహంలో కొట్టుకుపోవలసిందే. ఆ నేనుని తెలుసుకోవటానికి ఈ దేహాన్ని, మనస్సును ఎంతవరకు ఉపయోగించుకొంటున్నావో అంతవరకే ఈ రెండూ ఉపయోగం, మిగతాది అంతా దుమ్ము అన్నారు భగవాన్.

సాధన అంటే మొద్దు అబ్బాయిలాగ కూర్చోవటం కాదు. మనకు ఎవరైనా ఉపకారం చేస్తే వారిపట్ల ఇష్టం వచ్చేస్తుంది. మనకి ఎవడో అపకారం చేస్తాడు. వాడి మీద కోపం వచ్చేస్తుంది. ఇక్కడ మన మనస్సు చెదిరిపోతుంది అలా కాదు. మన మనస్సు చాపల్యం లేకుండా నిర్మలంగా ఉండాలి. మీరు పుస్తకాలు చదివితే ఏమీ వచ్చేయదు. మనకి ఉపకారం చేసినవాడిలోను నారాయణుడు ఉన్నాడు, మనకి అపకారం చేసిన వాడిలో కూడా నారాయణుడు ఉన్నాడు. వాడు ఎందుకు అపకారం చేస్తున్నాడంటే లోపల ఉన్న నారాయణుడు వాడిని గిల్లుతాడు. మనం ఎంతవరకూ తట్టుకోగలమో, ఎంతవరకు మన బ్రెయిన్ బేలెన్స్‌గా ఉంటుందో చూస్తాడు, భగవంతుడు ఏమి చేస్తాడు అంటే సాధకుడు ప్రతికూలమైన పరిస్థితులలో ఎలా ఉంటున్నాడు, అనుకూలమైన పరిస్థితులలో ఎలా ఉంటున్నాడు, రెండూ బేలెన్స్ చేసుకుంటున్నాడా లేదా? లేకపోతే మనస్సుని పాడుచేసుకొంటున్నాడా అని చూసి, మన మనస్సుని పాడుచేసుకొంటూ ఉంటే ఇంక మనల్ని ఎండబెట్టటం మానేసి మట్టిలో కలిపేస్తాడు. మట్టిలో కలిపేస్తే మళ్ళీ శరీరాలు ధరిస్తాము. మీరు నన్ను స్తోత్రం చేస్తారు అనుకోండి నాకు కలిసి వచ్చేది ఏమీలేదు. మీరు నిందిస్తారు అనుకోండి నాకు వచ్చే అవమానం లేదు. ఇవన్నీ దేహగతమైన విషయాలు. ఈ గొడవలన్నీ మనస్సులో ఉన్నాయి. ఈ మనస్సు అనే గెడప దాటితే అది మహా చైతన్యం. అయితే ఈ మనస్సు అనే గెడప దాటటానికి అనేక పరీక్షలు వస్తాయి. ఇవన్నీ తట్టుకుంటే గాని మనస్సు అనే గెడప దాటలేము.

పునాది లేకుండా ఇల్లు కట్టేస్తే మీ ఇల్లు ఎంతకాలం నిలబడుతుంది అన్నారు పతంజలి మహర్షి. శమము, దమము ముందు చూసుకోండి అని చెప్పారు. శమము అంటే మనోనిగ్రహము, దమము అంటే ఇంద్రియ నిగ్రహం. మీరు మనస్సులో ఏమనుకుంటారంటే

తిండి దగ్గర జాగ్రత్తగా ఉండాలి. మన దేహానికి రోగం వచ్చేది ఏమీ తినకూడదు. మన శరీరయాత్రకి సరిపడే తినాలి అనుకుంటారు. మీరు ఎవరి ఇంటికి అయినా వెడితే వారు జిన్ను పెడతారు అనుకోండి మీ ఇంద్రియాలు దానిమీద ఆకర్షించి ఆ జిన్ను తినేయి అని చెబుతాయి. నేను తినకూడదు అని నిర్ణయించేసుకున్నాను అని మనస్సు చెబుతుంది. ఈ ఇంద్రియాలు అన్నీ కలిపి మనస్సుని బయటకు తీసుకువచ్చేస్తాయి. మొత్తం మీద వాడు తినేస్తాడు. అంటే నీకు మనోనిగ్రహం ఉండి ఇంద్రియ నిగ్రహం లేకపోతే నువ్వు యోగంలో సక్సెస్ అవ్వవు అని పతాంజలి చెప్పారు. చైతన్య ప్రభువుకి పంచదార నాలుకమీద వేస్తే పట్టిమీద వేసినట్టు ఉండేది. అది ఎలాగ ఉందో అలేగే బయటకు తీసుకోవచ్చు. ఒక్క అణువు కూడా చెమ్మగిల్లదు. అది చైతన్యుడి యొక్క ఇంద్రియనిగ్రహం. యోగం అంటే మీరు కంగారుపడకండి. దుఃఖము తోటి మనకు ఉన్న సంబంధాన్ని, అశాంతితోటి మనకు ఉన్న సంబంధాన్ని, రాబోయే జన్మలతోటి, కోరికలతోటి మనకి ఉన్న సంబంధాన్ని తెంపేదే యోగం. భక్తియోగం, కర్మయోగం, జ్ఞానయోగం. యోగాభ్యాసంలో అభివృద్ధిలోనికి వెళ్ళాలనుకున్నప్పడు శమము, దమము పునాదిరాళ్ళు. ఇవి లేకుండా నీకు ఏకాగ్రత సాధ్యంకాదు. ఏకాగ్రత లేకపోతే ఆత్మజ్ఞానం లేదు. మనకు తెలియని విషయాన్ని చెప్పేది శాస్త్రం. హృదయగుహలోనికి ప్రవేశించటానికి మార్గం చూపేది శాస్త్రం. అందుచేత అర్జునా నువ్వు శాస్త్రాన్ని అనుసరించు అని పరమాత్మ చెప్పాడు.

కృష్ణుడు ముందు ధర్మం అనే శబ్దంతోటే భగవద్గీతని ప్రారంభించాడు. మన దేశంలో ఇంత క్షోభ, ఇంత అల్లరి, ఇంత అశాంతి ఎందుకు అంటే మనందరం ధర్మాన్ని విడిచిపెట్టేయటం వలన ఇది అంతా వస్తోంది. మనం ధర్మానికి కట్టుబడి ఉంటే పోలీస్ స్టేషన్లు అక్కరలేదు, సబ్‌రిజిష్ట్రారు ఆఫీసులు అక్కరలేదు. మనం ధర్మాన్ని ఆచరించము అనుకోండి మన మనస్సు నశించదు. అసలు నీకు మాట ఎందుకు వస్తోంది. మనం రోజూ మాట్లాడే మాటలలో అవసరం ఉండి ఎన్ని మాట్లాడుతున్నాము, అవసరం లేకుండా ఎన్ని మాట్లాడుతున్నాము, అవసరం లేకుండా మాట్లాడుతూ ఉంటే అహంభావన పెరిగిపోతుంది, దేహమే ఆత్మ అనే బుద్ధి పెరిగిపోతుంది. మీకు మేము నిశ్శబ్దముగా శాంతిని, సుఖాన్ని ఇవ్వగలిగితే ఇంక శబ్దము ఎందుకు? దక్షిణామూర్తి నిశ్శబ్దముగా ఉండి సనత్‌కుమారుడు వాళ్ళకి జ్ఞానాన్ని ఇచ్చాడు. మేము నిశ్శబ్దముగా ఉండి మీకు జ్ఞానాన్ని ఇవ్వలేకే మాట చెప్పవలసి వస్తోంది. కర్మఫలాన్ని ఇచ్చేవాడు ఈశ్వరుడు. ఈశ్వరుడు ఆ మనిషిని జమిందారుని ఎందుకు చేస్తున్నాడో మనకి తెలియదు, నిన్ను ఎందుకు దరిద్రుణ్ణి చేస్తున్నాడో తెలియదు. దీనికి

పూర్వజన్మలకి సంబంధం ఉంటుంది. మళ్ళీ దీనికి రాబోయే జన్మలకీ సంబంధం ఉంటుంది. అది మనకు తెలియదు. అది మన కళ్ళకు కనబడదు, మన బుద్ధి దానిని గ్రహించలేదు. కర్మఫలం ఈశ్వరుడు పంచిపెడతాడు. అందుచేత ఈశ్వరుడికి లొంగివుండవలసిందే.

ఏ నేనుకి అయితే చావు లేదో, ఏ నేనుకైతే పుట్టుకలేదో దానికి దురదృష్టం లేదు, అదృష్టం లేదు. అదృష్టం వల్లా, దురదృష్టం వల్లా చలించేది నీ మనస్సు, దేహము అంతే. నువ్వు మనోదేహములుకాదు. వీటికంటే అతీతంగా నువ్వు ఉన్నావు. మనస్సుకి వచ్చే అదృష్టం, దురదృష్టం ఆ గొడవ కంప్లీట్‌గా వదిలేయండి. ఆ గొడవలు పట్టించుకోవద్దు. మీరు గురువు మీద ప్రేమ విడిచిపెట్టకుండా ఉంటే, గురువు మీద విశ్వాసం పోకుండా ఉంటే, గురువు మీద శ్రద్ధ పోగొట్టుకోకుండా ఉంటే ఆ గురువు ఏమి చేస్తాడు అంటే నీలో పనికిరానిది ఆయన మింగేసి, పనికి వచ్చేదానిని నీకు ఇస్తాడు వాడే గురువు. మనం ఏదైనా తిన్నప్పుడు బాగానే ఉంటుంది. కక్కు వచ్చాక మన కక్కు చూచి మనకే అసహ్యం వేస్తుంది. అలాగే మీలో ఉన్న బలహీనతలను నొక్కుతాడు, నొక్కితే మీరు కక్కకుండా ఆగలేరు. కక్కిన తరువాత ఆ బలహీనతలో ఉన్న చెడ్డ మీకు తెలుస్తుంది. ఆ బలహీనతల వల్ల వచ్చే నష్టం మీకు అర్థమయ్యేలాగ చెప్పి, మీ బుద్ధికి దానిని పట్టించి, అప్పుడు దానిని పోగొట్టుకునే శక్తి కూడా ఆయనే ఇచ్చి మిమ్మల్ని తరింపజేస్తాడు. వాడు గురువు. గురువుకి మీ ముచ్చట్లు, చప్పట్లు అక్కరలేదు. గురువుకి మీ స్తోత్రాలు అసలు అవసరం లేదు. వాడు ఏ అలౌకికసుఖం, ఏ అలౌకికఆనందం, ఏ అలౌకికశాంతిలో ఉన్నాడో ఆ స్థాయిలోకి మిమ్మల్ని తీసుకుపోవటం తప్పించి గురువుకి ఇంకో ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకే పులినోట్లో పడ్డ మాంసపు ముక్క అన్నారు భగవాన్. పులినోట్లో పడ్డ మాంసపుముక్క ఇంక బయటకు రాదు. ఒక నిమిషం వెనకో ముందో మింగేస్తుంది. ఒక్క దేవతాపురుషుడి అనుగ్రహం పొందితే ఆయన మిమ్మల్ని తరింపజేసేవరకు వెంటాడతాడు. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. సూర్యుడు బయట చీకటిని పోగొడతాడు, గురువు మన లోపల చీకటిని పోగొట్టి మన స్వరూపాన్ని మన చేతికి అందిస్తాడు. మీకు ఏదైనా గొప్పలు వస్తూ ఉంటే మీరు దానితో తాదాత్మ్యం పొందుతారు అనుకోండి మీరు పాడైపోతున్నారని గురువుకి తెలుస్తుంది. మిమ్మల్ని ఇరుకున పెట్టి ఆ తాదాత్మ్యాన్ని కత్తిరించేస్తాడు. ఇదంతా మీ మేలుకోసమే గురువు చేస్తున్నాడు అని మీరు గ్రహిస్తే ధన్యులు. ఇది మీకు గ్రహింపుకి రావాలి.

మనం ఎక్కడెక్కడో ప్రయాణాలు చేసి ఇంటికి వచ్చాక ఏమనిపిస్తుంది హమ్మయ్య మన ఇంటికి మనం వచ్చేసాం అనిపిస్తుంది. అలాగే మీరు మోక్షం దాకా వెళ్ళక్కరలేదు.

మీకు దారి చూపించే కరెక్టు గురువు దొరికితే మన పని పూర్తి అయిపోయింది ఒడ్డుకి వచ్చేశాం అనిపిస్తుంది. ఈశ్వర సంకల్పంతోటి మీరు రాజీపడటం నేర్చుకొంటే మీ సాధనతోటి సంబంధం లేకుండా, పూజలు, జపాలు, ధ్యానాలు, యజ్ఞాలుతోటి సంబంధం లేకుండా ఇప్పడే, ఇక్కడే మోక్షసుఖాన్ని పొందుతారు. మీకు ఆ మనోబలం ఉండాలి. ఈశ్వర ఇష్టాన్ని మీ ఇష్టంగా చేసుకోండి, ఈశ్వర సంకల్పం మీ సంకల్పం అనుకోండి అని మేము చెబుతున్నాము, భగవాన్ ఏమి అంటారంటే అసలు నువ్వు వుంటే కదా ఇష్టానికి, అయిష్టానికి అంటారు. ఆయనకంటే నేను వేరుగా ఉన్నానని అనుకోవటం వలన అలా చెబుతున్నావు కాని నువ్వు లేవు అసలు. నువ్వు లేవు అన్న సంగతి నీకు తెలియటం లేదు అందుకే నువ్వు అశాంతికి గురి అవుతున్నావు. ఉన్నది ఈశ్వరుడే. మీకు ఇష్టం లేకపోయినా ఈశ్వరుడి సంకల్పంతోటి రాజీపడటం నేర్చుకోండి. తుకారామ్ భార్య ఒకసారి చెరుకుగడపెట్టి తుకారామ్‌ని కొట్టేసింది. చెరుకుగడ రెండు ముక్కలు అయిపోయింది. అప్పడు తుకారామ్ భార్యతో కత్తిపీట చేసేపని నువ్వు చేసావు, రెండు ముక్కలు చేసావు కాబట్టి నీకోముక్క, నాకోముక్క అన్నాడు. అమ్మ కొడుతోంది కదా అని తెలియక పిల్లలు కూడా కొట్టేసేవారు. ఇన్ని అవమానాలు పడిన తుకారామ్‌కి వైకుంఠం నుండి విమానం వచ్చి ఆయనను తీసుకువెళ్ళింది. ఎందుచేతనంటే అవమానాలన్నీ వికారం లేకుండా భరించాడు. వాడికేమో మోక్షం, మనకి దుమ్ము. మనం చనిపోయినప్పడు మనకి యమకింకరులు వస్తారు. ఇంట్లో పిల్లల గురించి అయినా మీరు మాటలు బాగా మాట్లాడాలి. మీరు మాటలు తింగర తింగరగా మాట్లాడుతూ ఉంటే మీ అలవాట్లు అన్నీ మీ పిల్లలకు కూడా వచ్చేస్తాయి. తుకారామ్‌కు ఈశ్వరుడి పాదాలపట్ల ఉన్న ఆ ప్రేమప్రవాహంలో, శాంతిప్రవాహంలో నేను అనే తలంపు దానంతట అదే కొట్టుకుపోయింది. ఆ నేనుని పోగొట్టుకోవటానికి ప్రత్యేకంగా ఆయన ఏమీ సాధన చేయలేదు.


కొంతమందికి ఎంత డబ్బు ఉన్నా అలా సంపాదిస్తూ ఉంటారు, అదొక వాసన. కొంతమంది మనం వారి ఇంటికి వెళితే కాఫీ ఇవ్వరు ఎలక్షన్‌లో కోట్లు ఖర్చుపెడతారు, అది అధికారానికి సంబంధించిన వాసన. వాడి వాసనను బట్టి అలా ప్రవర్తిస్తాడు. వాడి వాసనను సంతృప్తి పరచుకోవటానికి ఖర్చుపెడతాడు. నీ వాసనను సంతృప్తి పరచుకోవటానికి నువ్వు ప్రయత్నం చేస్తూ ఉంటే ఆ వాసన పెరుగుతుంది కాని తగ్గదు. అందుచేత మనలో ఏ బలహీనత అయితే ఉందో ఆ బలహీనత పెంచే పనులు మనం చేయకూడదు. ఎవడో ధర్మవిరుద్ధంగా మాట్లాడుతున్నాడు అని నీవు మాట్లాడకూడదు, అది నీకు తగదు. వారు ఉద్రేకంగా

మాట్లాడుతున్నప్పుడు మనం ఎందుకు మాట్లాడకూడదు అని అలా ఉద్రేకంగా మాట్లాడతాము అనుకోండి, మోక్ష మార్గాన్ని తప్పిపోతాము, రాంగ్‌పాత్‌లోనికి వెళ్ళిపోతాము. మనం విషయాలలో ఉన్నప్పుడు, విషయం యొక్క పరిణామం ఎలా ఉంటుందో మనకి తెలియనప్పుడు అది మైసూర్‌పాక్‌లాగ ఉంటుంది. ఆ విషయచింతనలో ఇంతవిషం ఉంది అని గ్రహించటానికి వంద జన్మలు పట్టవచ్చు. మనం ధనంలో సుఖం ఉంది అని అనుకుంటున్నాము. ధనంలో సుఖంలేదు మన స్వరూపంలోనే సుఖం ఉంది అని తెలియటానికి వెయ్యి జన్మలు పట్టవచ్చు. సజ్జన సాంగత్యం లేకపోతే వెయ్యి జన్మలు అయినా కూడా వాడికి తెలియదు. భగవంతుడు మనకి సద్బుద్ధి ఇవ్వకపోతే సద్విషయాన్ని గ్రహించలేము. ఎక్కడైతే సుఖం లేదో ఆ వస్తువులోనే సుఖం ఉందని నమ్ముతున్నాము. అందులో సుఖం లేదని తెలియటానికి కొన్నివేల జన్మలు పట్టినా పట్టవచ్చు. మీకు ధనం ఉంటే దాచుకోండి లేకపోతే స్థలాలు కొనుక్కోండి అంతేగాని ధనం ఉందని మీ అవసరాలు పెంచుకోకండి. ధనం ఉందని భోగాలు పెంచేసుకుంటారు అనుకోండి ఈ భోగాలు అన్నీ రాబోయే జన్మలో రోగాలకింద మారిపోతాయి. భోగం ఉన్నవాడికే రోగం, భోగం లేనివాడికి రోగం లేదు.

ఐన్‌స్టీన్ ఒకమాట చెప్పాడు ప్రతీవాడూ ఇవాళ అది వండుకుతిన్నాము, ఇది వండుకుతిన్నాము. మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి ఇదే గోల. వాడి జీవితంలో ఒక్కడికైనా ఉపకారం చేసాడా? ఆకలితోటి బాధపడేవాడికి ఒక్కడికి అన్నము పెట్టావా? చలితోటి బాధపడేవాడికి ఒకడికైనా దుప్పటి ఇచ్చావా? ఒక అనాథ శవాన్ని తీసుకెళ్ళి వల్లకాటిలో దహనం చేయలేదు ఏమిటి మీరు ఎందుకు బతుకుతున్నారు. పదిమందికి కాదు కనీసం నీ జీవితంలో ఒక్కడికైనా ఉపయోగపడ్డావా? ఎంతసేపు నేను తిన్నాను, నేను కట్టుకున్నాను అంటావేమిటి? నీది కూడా ఒక బతుకేనా? ఇలా బతికినా చావుతోటి సమానం అని ఐన్‌స్టీన్ అన్నాడు. నేను కొంతమందిని చూసాను వాళ్ళు తెరమీద కనబడరు. పైగా వాళ్ళు పెద్ద ధనవంతులు కాదు. సామాన్య గృహస్థులు. శీతాకాలం చెట్లకింద, రైల్వే ప్లాట్‌ఫారమ్ మీద నిద్రపోయేవారి దగ్గరకు వెళ్ళి వాళ్ళకి తెలియకుండా దుప్పట్లు కప్పేసి వచ్చేవారు ఉన్నారు. ఫలానా వాళ్ళు నాకు దుప్పటి ఇచ్చారని వాళ్ళకి తెలియనక్కరలేదు. అటువంటి వారికి హృదయశుద్ధి కలుగుతుంది. హృదయ శుద్ధి కలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు. కొంతమంది ఎక్కడైనా పేచీలు ఉన్నాయి అనుకోండి ఆ పేచీలు పెంచేస్తారు. పెంచేసి సంతోషిస్తారు. ఎక్కడైనా పేచీలు ఉంటే వాటిని సమాధానపరచువారు ధన్యులు వారు దేవుని చూచెదరు.


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 11 | చించినాడ గీతామందిరం |
| మార్చి | 18 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| మార్చి | 22 | విస్సాకోడేరు వెంకటేశ్వరస్వామి దేవాలయం మధ్యాహ్నం గం॥ 3-00లకు |
| మార్చి | 25 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| మార్చి 27 నుండి ఏప్రియల్ 4 వరకు | | అరుణాచలం క్యాంపు |
| ఏప్రియల్ | 6 | మండపేట సీతారామ కళ్యాణ మండపం |




**"మంతెన రామలింగరాజు & కాంతమ్మ ఫౌండేషన్"**

**భీమవరంలో ఉపకార వేతనములు ఉత్సవంలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు**



**తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం, రాచపల్లిలో**

# "ఆంధ్రాలో అరుణాచలం"

**నిర్మాణం జరుగుచున్నది.**

**వివరములకు ఫోన్ నెంబర్లు :**

**08868 - 228737, సెల్ : 9948616363**

# దృశ్యాన్ని ఆశ్రయిస్తే - దుఃఖం తప్పదు

ఆరోగ్యవంతమైన మనస్సు గల ప్రాజ్ఞుడు దృశ్య విషయాలను చూడగానే ఇది ప్రమాదమని గ్రహించి వెంటనే దాని నుండి దృష్టిని మరల్చి అది పంచభూత నిర్మితమైనది అని దాన్ని పరహరిస్తాడు. ప్రేమ వేరు కామం వేరు. ప్రేమ దైవీగుణం. కామం ప్రకృతి గుణం. మనం ప్రేమలో లేకపోతే మనస్సులో వికారం, బీదరికం తప్పవు. ప్రేమ, సేవలో ఉన్నప్పడే మనం ఏ పని చేసినా అంతా సక్రమంగానే ఉంటుంది. రక్త మాంసములతో కూడిన ఈ దేహమునందు ప్రీతి కలిగి భగవంతుని మరిచిన వాడు నరకప్రాప్తి కలుగుతుంది. ప్రాపంచిక విషయాలు చెవుల ద్వారా వింటాము. కంటి ద్వారా దృశ్యాలను గ్రహించి ప్రపంచంలో నిమగ్నమైపోతాము. బయట దృశ్యాలు, భావాలు లోనికి ప్రవేశించకుండా చేయగల్గినప్పడు విధిగా మనస్సు అంతర్ముఖంగా వెళ్ళి అంతిమ రహస్యాన్ని తెలుసుకోగల్గుతుంది. దృశ్యం ఉండిన ద్రష్ట ఉండును. ద్రష్ట ఉండిన దృశ్యముండును రెంటికి బంధము ఉండును. దృశ్య బుద్ధి పరిపూర్ణంగా నశించనంతకాలం దృశ్యం కనబుడుతూనే ఉంటుంది. జ్ఞానము లభించదు. దృశ్యము మనోకల్పితమని ఆ భావన వీడుట కంటేవేరే మార్గము, ఉపాయము లేదు. దృశ్య జ్ఞానము మండుటెండ ఆత్మజ్ఞానం చెట్టు క్రింద నీడలాంటిది అని జ్ఞాని ఆత్మయందే నిలకడ కలిగి ఉంటాడు. మనం కూడా అలాగే భావించి నిర్వికారంగా ఉంటే నిమిషంలో కృతార్థులమౌతాము. ఏది సత్యమో దాన్ని గురించి విచారణ చేస్తే అజ్ఞానం నశిస్తుంది. ఈ బంధ మోక్షాల్లో ఏది మనకు నచ్చితే దాన్ని మనం ఎన్నుకోవచ్చును. ఇంద్రియ సుఖాలు పరిణామంలో దుఃఖాన్ని, వెగటును తీసుకొని వస్తాయి. ఆత్మ సుఖంలో మహదానందము కొలువై ఉంటుంది. కంటికి కనిపింపచేస్తున్నవన్నీ స్వప్నాలే. కనిపించే వస్తువులు అసత్యమైతే చూచేవాడు ఎలా సత్యమౌతాడు. మనం స్వప్నాల్లో జీవిస్తున్నప్పడు కూడా నిద్రలోనే ఉన్నాము. సంభవిస్తున్నవన్నీ కలలే అని తలపోయలేకపోతున్నాము. దానికి గురు అనుగ్రహం ఉంటే ఈ విషవలయం నుంచి బయటపడి నిజస్థితిలో నిలకడ కలిగి సుఖి అవుతాము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం